క్లుప్తంగా

## వైద్య పరికరాల అందజేత



**మల్హర్:** తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్ నిధులతో తాడిచర్ల ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను కంపెనీ అధికారులు సోమవారం ఉచితంగా అందించారు. ఏఎమ్మార్ జనరల్ ఫిజీషియన్ శ్రీకాంత్ ఈసీజీ మిషన్, ఫ్రిడ్జ్, నెబ్లైజర్, కంప్యూటర్, ప్రింటర్, వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సీబీపీ కెమికల్స్, ఎక్స్‌రే ఫిలిమ్స్, ఎక్స్‌రే కెమికల్స్‌ను వైద్యాధికారి వినయ్ భాస్కర్‌కు ఈ పరికరాలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ డీజీఎం రమేష్ బాబు, సీఎస్ఆర్ సూపర్ వైజర్ బొబ్బిలి నరేష్, హెచ్ఆర్ అడ్మిన్ ప్రశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రేకుల షెడ్డు ఏర్పాటు

**కన్నాయిగూడెం:** మండలంలోని బుట్టాయగూడెంలోని సీతారాముల ఆలయం వద్ద భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి గ్రామానికి చెందిన మరగోని రాజు (గౌరిరాజ జనరల్ కిరాణం) ఆధ్వర్యంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. దీంతో హనుమాన్ భక్తులు, గ్రామస్తులు రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కమిటీ ఎన్నిక

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నూతన ప్రెస్ క్లబ్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేవెల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా నాగుల సంతోష్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ వలి, ఇనుముల సడువలి, సంయుక్త కార్యదర్శిగా తోట చంద్రశేఖర్, కోశాధికారిగా భాస్కర చార్యులు, కార్యదర్శిగా కామిడి భాస్కర్ రెడ్డి ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులుగా కీర్తి శ్రావణ్, నీలం శ్రీకాంత్, కోరుకొప్పుల సదాశివ్, ఆరవెల్లి సంపత్ కుమార్, రెవెల్లి రాజబాబు, కొండగొర్ల సంతోష్‌ను ఎన్నుకున్నారు.

## దగ్ధమైన పంట పరిశీలన

**శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు పంట వ్యర్థాలను కాల్చే క్రమంలో గ్రామానికి చెందిన అన్నబోయిన రఘుపతికి చెందిన మూడు ఎకరాల ముప్పై ఆరు గుంటల్లో సాగుచేసిన మొక్కజొన్న కంకి పూర్తిగా దగ్ధంకాగా ధాన్యం కుప్ప 60శాతం కాలిపోయినట్లు రైతులు తెలిపారు. దీంతో బాధితుడు రఘుపతి మండల వ్యవసాయ అధికారి గంగాజమునకు దరఖాస్తు చేయగా సోమవారం ఏఓ గంగాజమున దగ్ధమైన మొక్కజొన్న కంకులను, ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా వాయు కాలుష్యం, భూమి సారం క్షీణించడం, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టం, భూమిలో సేంద్రియ కర్బన శాతం తగ్గుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వలన భూమి నిస్సారంగా మారుతుందని, పర్యావరణం దెబ్బతింటుందని, విషవాయువులు వి డుదల అవుతాయని అన్నారు. పంట వ్యర్థాల ను భూమిలో కలియదున్నడం ద్వారా భూ సా రం పెరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించాలని సూచించారు.

## పరిహారం చెల్లించాలి

**ములుగు రూరల్:** కన్నాయిగూడెం మండల పరిధిలోని కంతనపల్లి, ముప్పనపల్లి, గుర్రేవుల, బుట్టాయిగూడెం, చిట్యాల గ్రామాలలో బాండ్ మొక్కజొన్న సాగుచేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని సీపీఎం నాయకుడు రాజేందర్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ సంపత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాల సాగుతో దిగుబడి రాక రైతులు అప్పులపాలయ్యారని తెలిపారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. అలాగే సన్నధాన్యం కొనుగోలులో మిల్లర్ల కోతలు లేకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అదనపు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు.

# బ్యాంకులో మేనేజర్ లేడు..!

- పూర్తి స్థాయిలో అందని సేవలు
- ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు



టేకుమట్లలోని యూనియన్ బ్యాంక్

**టేకుమట్ల:** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్ గత నెల 25న బదిలీపై వెళ్లడంతో మేనేజర్ లేక ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకులో మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, క్యాషియర్, ఆర్డీఓ, క్లర్క్ ఉండాల్సింది. కానీ ప్రస్తుతం క్యాషియర్, ఆర్డీఓ మాత్రమే పని చేయడంతో ఖాతాదారులకు పూర్తిస్థాయిలో బ్యాంకు సేవలను అందించలేక పోతున్నారు. ప్రస్తుతం బ్యాంకులో మేనేజర్ లేకపోవడంతో ఖాతాదారులు నగదును జమ చేయడం, విత్‌డ్రా చేసే సేవలను మాత్రమే వినియోగించుకుంటున్నారు. క్రాఫ్ లోన్, గోల్డ్‌లోన్ తీసుకునే ఖాతాదారులు ప్రతీ రోజు ఎండల్లో బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇతర బ్యాంకులో లోన్ తీసుకోవాలంటే బ్యాంకు ఖాతా తప్పని సరిగా ఉండాలి. కావున ఖాతాదారులు నూతన మేనేజర్ కోసం ఎదురు చూస్తున్నారు. బ్యాంకు అధికారి బదిలీ అయితే మరుసటి రోజు, లేదా, మరో రోజు అధికారిని నియమించాల్సి ఉండగా 18 రోజులు కావస్తున్నా నియమించకపోవడంతో ఖాతాదారులు అధిక వడ్డీలకు నగదును అప్పుగా తీసుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా రిజనల్ బ్యాంకు అధికారులు స్పందించి బ్యాంకు మేనేజర్‌తో పాటు, పూర్తి స్థాయి సిబ్బందిని వెంటనే నియమించాలని మండలంలోని ఖాతాదారులు కోరుతున్నారు.

### ఇబ్బంది పడుతున్నాం..



నాకు యూనియన్ బ్యాంక్‌లో పీఎం విశ్వకర్మ పథకం కింద రూ.లక్ష లోన్ మంజూరైంది. మేనేజర్ బదిలీ కావడంతో నగదు నా ఖాతాలోకి ఇంకా బదిలీ కాలేదు. రోజు బ్యాంకుకు వస్తూ, పోతున్నా. నా లాంటి వారు ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మేనేజర్‌ను నియమించి బ్యాంకు సేవలను అందించాలి. - బట్టల మొగిళి, గుమ్మడవెల్లి

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఈఓ కొడెపాక రఘుపతి



మాట్లాడుతున్న ఎంఈఓ కొడెపాక రఘుపతి

**చిట్యాల:** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ కొడెపాక రఘుపతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న 6 నుంచి 9 వతరగతి విద్యార్థులు ఈ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు రాజమౌళి, బుర్ర సదయ్య, గోపగాని భాస్కర్, ఈఆర్పీ రాజు, కనకం భద్రయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలి

- ఎమ్మెల్సీ మధుసూదనాచారి

**శాయంపేట :** గ్రామ ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మండలంలోని కొప్పులలో ఇటీవల పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగగా సోమవారం ముదిరాజ్ కులస్తులంతా బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి బోనం ఎత్తుకొని అమ్మవారి సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొప్పుల గ్రామ ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలని కోరారు. గ్రామంలో రైతుల పంటలు బాగా పండేలా పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చిట్యాల: ఆస్పత్రిలో రోగుల వార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**భూపాలపల్లి రూరల్:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్రసత్యనారాయణరావు అన్నారు. ఇటీవల పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందిన 146 మందికి సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 35 లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, క్లస్టర్ ఏఈఓలతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు అందించే సేవలపై అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారులు, పార్టీ నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, తోట రంజిత్, బడితెల ప్రసాద్ పాల్గొన్నారు.

**అస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తా..**

**చిట్యాల:** మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక సివిల్ ఆస్పత్రిని ఆయన సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిలోని డాక్టర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వివేక్, అఖిల, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి-సత్యం, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, గడ్డం కొమురయ్య, చిలుకల రాయకొమురు, కట్కూరి నరేందర్, మూల శంకర్ గౌడ్, దబ్బెట అనిల్, కామిడి రత్నాకర్‌రెడ్డి, సర్వ శరత్, గణపతి, మల్లయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



వాజేడు: కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్న పురోహితుడు



వెంకటాపురం(కె)లో..

**వాజేడు:** మండల పరిధిలోని చీకుపల్లి బొగత జలపాతం వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి కల్యాణ తంతుకు సబంధించిన పూజలను చేశారు. మధ్యాహ్నం 12.05 గంటలకు స్వామివారి కల్యాణంను ఆలయ నిర్వాహకురాలు ఉయిక రాంబాయి ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రాలతో జరిపించారు. ఈ కల్యాణ వేడుకను తహసీల్దార్ శ్రీనివాస్ హాజరై తిలకించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం హోమం జరిపించడంతో పాటు భక్తులకు అన్నదానం అందించారు.

**నడిబాకగుడి గుట్టల్లో..**

**వెంకటాపురం(కె):** మండల పరిధిలలోని నడిబాక గుడి గుట్టల్లో కన్నుల పండుగగా లక్ష్మి నరసింహ స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల కల్యాణ వేడుకను నిర్వహించారు. కల్యాణ మహోత్సవ వేడుకను పురోహితులు శ్రీనివాస శర్మ నిర్వహించిగా భక్తులు స్వామి వారికి పట్టు వస్త్రలను సమర్పించుకోని మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రంగాణంలో భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ వేడుకలను తిలకించేందకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కల్యాణ వేడుకలకు వచ్చిన భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చువ పందిల్లు, తాగు నీటి సౌకర్యం కల్పించారు.

## ప్రభుత్వ పథకాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**ములుగు రూరల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలపై గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సోమవారం మల్లంపల్లి మండలంలోని భూపాల్‌నగర్‌లో పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, మహాలక్ష్మీ పథకం, గృహజ్యోతి , భూ భారతి, రైతు భరోసా కార్యక్రమాలతో పాటు వడ దెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాకారులు తమ ఆట పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రహీమొద్దీన్, మార్త రవి, రాగుల శంకర్, రేలా విజయ్, గోల్కొండ భిక్షపతి, అమ్మపాట తిరుపతి, కిషన్, రాజేందర్, సురేష్, కుమార్, దీపక్, శ్రీలత, శోభ, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



రేగొండ: ఆర్థికసాయం అందజేస్తున్న సుధాకర్



ఏటూరునాగారంలో..

**రేగొండ:** మండలంలోని రాయపల్లి గ్రామానికి చెందిన ఆవుదాపురం విజేందర్ ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. విజేందర్ 108 ఎమర్జెన్సీ సర్వీస్‌లో మేడ్చల్ జిల్లా మేనేజర్‌గా విధులు నిర్వహించేవాడు. దీంతో జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ తరుపున సీఈఓ సుధాకర్ బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీపీపీ విజయ్‌కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మరిజ లక్ష్మణ్, జిల్లా మేనేజర్ మేరుగు నరేశ్, సిబ్బంది దేవేందర్, కుమార్, శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.

**ఏటూరునాగారం:** మండల కేంద్రానికి చెందిన కప్ప వెంకన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మృతుడితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు రూ.10700ల నగదును ఆర్థిక సాయంగా సోమవారం అందజేశారు. స్నేహితులు గజ్జెల సుమన్, రాజశేఖర్, నేతాజీ ఫౌండేషన్ సభ్యులు, కమలాకర్, రాజ్‌కుమార్, సతీష్, లవన్, అశోక్ పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్‌కుమార్



ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు సూచనలు చేస్తున్న విపిన్‌కుమార్

**ములుగు:** కుటుంబ నియంత్రణ పద్ధతులపై దంపతులకు అవగాహన కల్పించాలని, తాత్కాలిక పద్ధతులు ఐయూడీ ఓరల్ పిల్స్, ఇతర ఇంజక్షన్లు, కండోమ్స్ వినియోగం వంటి అంశాలను వివరించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని వైద్యశాఖ కార్యాలయంలో ఫ్యామిలీ ప్లానింగ్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టంపై పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్టులు, ల్యాబ్ అసిస్టెంట్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీహెచ్‌సీలకు వైద్యం కోసం వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్‌కార్డుతో వచ్చేలా చూడాలన్నారు. రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టింలోని ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, రణధీర్, హెల్త్ ఎడ్యుకేటర్ స్వరూపారాణి, ఫార్మసిస్ట్ వినోద్, నిఖిల్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణసంపత్‌రావు, దుర్గారావు, డీపీఎంఓ సాంబయ్య, డీపీహెచ్ఎం శకుంతల, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## పరామర్శ



పరామర్శిస్తున్న పుట్ట మధు

**కాటారం:** మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను సోమవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు రామర్శించారు. మండల కేంద్రంలో చీమల రమేశ్ మృతి చెందగా మృతుడి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ధన్వాడలో ఇటీవల మృతి చెందిన తుల్సెగారి రాజలింగు కుటుంబాన్ని, ఆదివారంపేటలో మృతి చెందిన రాజిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కొత్తపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ది మౌనికను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పుట్ట మధు వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, ఊర వెంకటేశ్వరరావు, గాలి సడువలి, ఉప్పు సంతోష్, శ్రీలక్ష్మి, రాజబాబు, దుర్గారావు, తదితరులు ఉన్నారు.

## సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

**శాయంపేట :** ఈనెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగే సీపీఐ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. మండలంలోని మాందారిపేట శివారులో గల గుడిసెవాసుల సమావేశం సీపీఐ నాయకుడు బండారి సాంబయ్య అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా భిక్షపతి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంపై మోదీ ప్రభుత్వం దొంగ ప్రేమ చూపిస్తోందని, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఈనెల 26, 27వ తేదీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా 2వ మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాందారిపేట, గట్లకానిపర్తి, సూరంపేట గ్రామాల సీపీఐ అధ్యక్షులుగా బండారి సాంబయ్య, సముద్రాల మణెమ్మ ఉన్నారు.

# దేశానికి రాజ్యాంగమే శ్రీరామరక్ష

**కన్నాయిగూడెం:** దేశానికి అంబేడ్కర్ అందించిన రాజ్యాంగమే శ్రీరామరక్ష అని నేతకాని కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు అన్నారు. సోమవారం జిల్లాలోని నేతకాని కుల సంఘం నాయకులు జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా పెద్దపల్లి మండలంలోని చాకపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠకు భారీ సంఖ్యలో బయలుదేరారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి చంద్రబాబు, సునార్కని పెద నారాయణ, పూసల నర్సింహారావు, సునార్కని రాంబాబు, సాంబశివరావు, కొండగొర్ల పోషయ్య ఉన్నారు.

## జనరేటర్ బహూకరణ



జనరేటర్ అందజేస్తున్న దాతలు

**శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయానికి మండల కేంద్రానికి చెందిన మామిడి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మామిడి ప్రమోద్, త్రిశూల్, సాయిక్రిష్ణలు రూ.35వేల విలువచేసే జనరేటర్‌ను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ భిక్షపతి జనరేటర్ అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# తునికాకు సేకరణ షురూ..



కల్లంలో తునికాకు కట్టలు లైన్లో పెడుతున్న కార్మికులు



కల్లంలో కట్టలను లెక్క బెడుతున్న కార్మికురాలు

- కగార్ ఆపరేషన్ ముగింపుతో ప్రారంభం
- అడవి బాటపట్టిన గిరిజనులు

**వాజేడు:** ఎట్టకేలకు తునికాకు సేకరణ సోమవారం నుంచి ప్రారంభమైంది. మండలంలోని 900 స్టాండర్డ్ బ్యాగులు(9 లక్షల కట్టలు) తునికాకును సేకరించాల్సి ఉంది. తునికాకు సేకరణ చేపట్టాలని ఉదయం ప్రకటించగానే కార్మికులు ఆకుల సేకరణకు అడవిలోకి వెళ్లారు. 50 ఆకుల కట్టకు రూ.3.30 ఇవ్వనున్నట్లు రేంజర్ చంద్రమౌళి తెలిపారు. కగార్ ఆపరేషన్ నేపథ్యంలో తునికాకు సేకరణ ఉంటుందో.. లేదోననే సందిగ్ధం ఇన్ని రోజులు నెలకొంది. అడవిలోకి ప్రజలు రావద్దని పోలీసులు ప్రకటించిన క్రమంలో కేవలం మైదాన ప్రాంతంలోనే తునికాకు సేకరించనున్నట్లు అటవీశాఖ అధికారులు ప్రకటించారు. కగార్ ఆపరేషన్ తాత్కాలికంగా ఆగిపోవడంతో తునికాకు సేకరణ పనులను మొదలు పెట్టారు. అందులో భాగంగా ఆకుల సేకరణకు గిరిజనులు అడవి బాట పట్టి వారు కోసుకొచ్చిన ఆకులను కట్టలు కట్టి కల్లాల్లో విక్రయించారు.

## విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

**కాటారం:** విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాడిపెల్లి అశోక్ అనే రైతు తన పొలం వద్దకు ఎద్దులను తీసుకెళ్లి పశుగ్రాసం కోసం వదిలిపెట్టాడు. ఓ దుక్కిటెద్దు పశుగ్రాసం మేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉంటుందని విద్యుత్‌శాఖ ద్వారా ఆర్థిక సాయంఅందించి ఆదుకోవాలని అశోక్ వేడుకున్నారు.